క్లుప్తంగా

కండలేరులో 14.693 టీఎంసీలు

రాపూరు: కండలేరు జలాశయంలో ఆదివారం నాటికి 14.693 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు జలాశయం ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. హెడ్‌రెగ్యులేటర్ నుంచి సత్యసాయి గంగ కాలువకు 850 క్యూసెక్కులు, పిన్నేరు వాగుకు 10, మొదటి బ్రాంచ్ కెనాల్‌కు 50, లోలెవల్ స్లూయిస్‌కు 130 క్యూసెక్కుల వంతున విడుదల చేస్తున్నట్లు వివరించారు.

ముత్యాలమ్మకు ప్రత్యేక పూజలు


అలంకరణలో ముత్యాలమ్మ

చిల్లకూరు: శ్రావణ మాసం రెండో ఆదివారం సందర్భంగా తూర్పుకనుపూరులోని ముత్యాలమ్మకు ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం అభిషేకాలు, విశేషాలంకరణ చేసి భక్తులకు దర్శనం కల్పించారు. మహిళలు ఆలయ ప్రాంగణంలో దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ ఈఓ నవీన్‌కుమార్, ఆలయ ట్రస్టు చైర్‌పర్సన్ సిద్ధారెడ్డి ఇంద్రసేనమ్మ పర్యవేక్షించారు.

ఉపాధ్యాయుడి మృతి

పెళ్లకూరు: మండలంలోని చింతపూడి ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న ఈరి తిరుమలకొండయ్య(54) అనారోగ్యంతో ఆదివారం మృతి చెందారు. కొంత కాలంగా గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతున్నారు. ఈయన భార్య సుశీల కనపర్తి ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పని చేస్తున్నారు. ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. తిరుమల కొండయ్య మృతి విషయం తెలుసుకున్న పలువురు ఉపాధ్యాయులు, అధ్యాపకులు శ్రీకాళహస్తిలోని ఆయన నివాసానికి వెళ్లి మృతదేహానికి నివాళులర్పించారు.

నేదురుమల్లికి కృతజ్ఞతలు


ప్రభాకర్‌రెడ్డి

సైదాపురం: వైఎస్సార్ సీపీ తిరుపతి జిల్లా కార్యవర్గ సభ్యుడిగా వరదబండి ప్రభాకర్‌రెడ్డి నియమితులయ్యారు. తనకు పదవి ఇచ్చిన నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని తెలిపారు.

చోరీపై ఫిర్యాదు

కోట: కోట క్రాస్ రోడ్డులోని లక్ష్మీ పెయింట్స్ దుకాణంలో శనివారం రాత్రి చోరీ జరిగినట్లు దుకాణదారుడు శ్రీకాంత్ ఆదివారం ఎస్‌ఐ పుల్లారావుకు ఫిర్యాదు చేశాడు. దుకాణానికి ఉన్న షెట్టర్‌ను పగలగొట్టి దుండగులు రూ.85వేలు చోరీ చేసినట్లు పేర్కొన్నాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు సమీపంలో ఉన్న సీసీ ఫుటేజీలను పరిశీలించి విచారణ జరుపుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

హుండీ లెక్కింపు నేడు

వెంకటగిరిరూరల్: వెంకటగిరి గ్రామశక్తి పోలేరమ్మతల్లి ఆలయం హుండీ లెక్కింపు సోమవారం ఉదయం నిర్వహించనున్నట్లు ఆలయాధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని పాతకోట రామమందిరంలో నగదు లెక్కింపు కార్యక్రమం ఉంటుందని చెప్పారు.

అమ్మవారి సేవలో మాజీ సీజేఐ


మాజీ సీజేఐ ఎన్వీ రమణ

తిరుచానూరు(చంద్రగిరి): తిరుచానూరు పద్మావతి అమ్మవారిని ఆదివారం సుప్రీం కోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. ఆయనకు జేఈఓ వీరబ్రహ్మం స్వాగతం పలికి ప్రత్యేక దర్శనం కల్పించారు. అనంతరం ఆలయ ఆశీర్వాద మండపంలో వేద పండితులు ఆశీర్వచనం అందించగా జేఈఓ తీర్థ ప్రసాదాలతో సత్కరించారు. కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈఓ గోవిందరాజన్, ఏఈఓ రమేష్ పాల్గొన్నారు.

మద్యం మత్తులో ఘర్షణ


గాయపడిన సిద్ధు

శ్రీకాళహస్తి: మద్యం మత్తులో ఇద్దరు ఘర్షణకు దిగి ఒకరికి గాయాలైన ఘటన శ్రీకాళహస్తి పట్టణంలో ఆర్టీసీ బస్టాండు వద్ద చోటు చేసుకుంది. తొట్టంబేడు మండలం చోడవవరం గ్రామానికి చెందిన సిద్ధు భవన నిర్మాణ కార్మికుడిగా పని చేస్తుంటాడు. ఆదివారం సాయంత్రం ఆర్టీసీ బస్టాండు వద్ద మద్యం సేవించిన సిద్ధు, ఓ గుర్తు తెలియని వ్యక్తికి మధ్య ఘర్షణకు దారితీసింది. ఈ క్రమంలో గుర్తు తెలియని వ్యక్తి బ్లేడ్‌తో సిద్ధుపై దాడిచేయగా కంటిపై గాయమైంది. దీంతో గుర్తు తెలియని వ్యక్తి పరారయ్యాడు. 2వ పట్టణ పోలీసులు అక్కడికి చేరుకుని సిద్ధును ఆస్పత్రికి తరలించారు.

అసత్య ప్రచారాలను తిప్పికొట్టండి

• సోషల్ మీడియా కన్వీనర్లతో ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య


సోషల్ మీడియా సభ్యులతో ఎమ్మెల్యే సంజీవయ్య, పార్టీ నాయకులు

నాయుడుపేటటౌన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి కోసం వైఎస్సార్‌సీపీకి చెందిన సోషల్ మీడియా సభ్యులు సైనికుల్లా పని చేయాలని, ప్రతిపక్షాలు చేస్తున్న అసత్య ప్రచారాలను తిప్పికొట్టాలని సూళ్లూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య అన్నారు. మండలంలోని కిన్నెర ఫంక్షన్ హాల్‌లో ఆదివారం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ సోషల్ మీడియా సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సీఎం జగనన్న పాలనలో అమలవుతున్న సంక్షేమ పథకాలతో పాటు అన్ని వర్గాల అభివృద్ధి కోసం చేస్తున్న కార్యక్రమాలను ప్రతి ఒక్కరికీ తెలియజేయాల్సిన బాధ్యత వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా కన్వీనర్లదేనని తెలిపారు. అదే విధంగా చంద్రబాబు, లోకేష్, పవన్‌కల్యాణ్ చేస్తున్న అసత్య ప్రచారాలను తిప్పికొట్టేలా చురుకైన పాత్ర పోషించాలని సూచించారు. ముఖ్యంగా ప్రజలకు సంబంధించి అనేక సామాజిక కార్యక్రమాల్లో సైతం తమ వంతు బాధ్యతగా సోషల్ మీడియా సభ్యులు పనిచేయాలన్నారు. ప్రభుత్వం ప్రజలకు మంచి చేసింది కాబట్టి వచ్చే ఎన్నికల్లో తమను ఆదరించాలని ధైర్యంగా ప్రతి ఇంటి వద్దకు వెళ్లి అడుగుతున్నామన్నారు. జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిగా చేసుకోవడానికి అందరం సమష్టిగా పనిచేద్దామన్నారు. ఎన్‌డీసీసీబీ చైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణ రెడ్డి, నియోజకవర్గ పరిశీలకుడు మాలెం సుధీర్‌కుమార్ రెడ్డి, పార్టీ సోషల్ మీడియా తిరుపతి జిల్లా అధ్యక్షుడు బాలిశెట్టి కిషోర్, జిల్లా కో-కన్వీనర్ రాకేష్ మాట్లాడుతూ.. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి పార్టీ విజయానికి కృషి చేస్తామన్నారు. వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా సూళ్లూరుపేట కన్వీనర్ గోకుల్, కో కన్వీనర్ నారాయణరెడ్డి, రత్నశ్రీ, ప్రసన్నకుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు, లోకేష్‌లపై పోలీసులకు ఫిర్యాదు


ఫిర్యాదు చేస్తున్న వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా సభ్యులు

నాయుడుపేటటౌన్: రాష్ట్రంలో శాంతిభద్రతలకు విఘాతం కల్పిస్తున్న టీడీపీ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు, ఆ పార్టీ నాయకులు అచ్చెంనాయుడు, నారా లోకేష్‌పై చర్యలు తీసుకోవాలని వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా సభ్యులు ఆదివారం నాయుడుపేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. లోకేష్ పాదయాత్రలో కార్యకర్తలను రెచ్చగొట్టేలా ప్రసంగాలు చేస్తున్నారని పేర్కొన్నారు. గొడవలు సృష్టించేందుకు ఉసిగొల్పుతున్నారని తెలిపారు. పుంగనూరు, తంబళ్లపల్లి, మాచర్ల నియోజకవర్గాల్లో జరిగిన గొడవలే నిదర్శనమన్నారు. ఈ మేరకు ఎస్‌ఐ కృష్ణయ్యకు ఫిర్యాదు అందజేశారు. పార్టీ నాయకులు బాలిశెట్టి కిషోర్, రాకేష్, గోకుల్, నారాయర రెడ్డి ఉన్నారు.

శివసాయి విద్యార్థుల ప్రతిభ


పుష్ప


శ్రావ్య


శివదీప్తి

కలువాయి: విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం విడుదల చేసిన డిగ్రీ ఫైనల్ పరీక్షల్లో కలువాయి శ్రీశివసాయి విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఏ.పుష్ప 9.60 పాయింట్లతో ప్రథమ స్థానం సాధించగా టి.శ్రావ్య 9.49 పాయింట్లతో ద్వితీయ స్థానం, బి.శివదీప్తి 9.41 పాయింట్లతో తృతీయ స్థానం సాధించినట్లు కళాశాల ప్రిన్సిపల్ జి.నరేంద్రకుమార్ తెలిపారు. ఆదివారం కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మండల స్థాయిలో ప్రతిభ కనబరిచినందుకు విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ పి.శ్రీనివాసులు, ఏఓ దేవదానం, అధ్యాపకులు పాల్గొన్నారు.

నేడు బండేపల్లెలో గడప గడపకు..

రాపూరు: మండలంలోని సిద్ధవరం సచివాలయం పరిధిలో ఉన్న పోమవాకం బండేపల్లె, సిద్ధవరం హరిజనవాడ, అరుంధతీవాడలో సోమవారం గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహించనున్నట్లు జేసీఎస్ కన్వీనర్ దందోలు నారాయణ రెడ్డి తెలిపారు. ఆయా గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు, వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డి, ఎమ్మెల్సీ మేరగ మురళీధర్, వైఎస్సార్‌సీపీ నాయకులు పాపకన్ను మధురెడ్డి, దయాకర్‌రెడ్డి పర్యటిస్తారని చెప్పారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు విజయవంతం చేయాలని కోరారు.

జోరుగా షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణ పనులు


ఎన్‌జేఆర్ కాంప్లెక్స్ నిర్మాణ పనులు

నాయుడుపేటటౌన్: పట్టణంలో శిథిలావస్థకు చేరుకున్న నేదురుమల్లి జనార్దన్‌రెడ్డి షాపింగ్ కాంప్లెక్స్‌ను పూర్తిగా పడగొట్టి నూతన భవనాల నిర్మాణ పనులు జోరుగా సాగుతున్నాయి. ఎన్‌జేఆర్ దుకాణాల సముదాయంలో మొత్తం 30 దుకాణాలు ఉన్నాయి. శిథిలావస్థకు చేరుకోవడంతో సూళ్లూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య చొరవ తీసుకున్నారు. వాటిని పూర్తిగా పడగొట్టి నూతన దుకాణ సముదాయం నిర్మాణానికి చర్యలు తీసుకున్నారు. నూతన సముదాయం అందంగా తీర్చిదిద్దేలా చర్యలు తీసుకుంటున్నామని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస రావు తెలిపారు.


జోరుగా ప్రవహిస్తున్న కైవల్యానది

కైవల్యా పరవళ్లు

సైదాపురం: తెలుగు గంగ జలాలు విడుదల చేయడంతో సైదాపురం సమీపంలో కై వల్యానది కొద్ది నెలలుగా జోరుగా ప్రవహిస్తోంది. నదీ పరివాహక ప్రాంతాల్లోని రైతులు వ్యవసాయ పనుల్లో బిజీబిజీగా ఉన్నారు. సైదాపురం, వేములచేడు, గంగదేవిపల్లి, అనంతమడుగు, పాలూరు, రామసాగరం, నల్లబొట్లపల్లి, పాతాళపల్లి, చీకవోలు తదితర గ్రామాల్లోని రైతులు వ్యవసాయ పనులు చేసుకుంటున్నారు. కైవల్యానది నాలుగేళ్లుగా అన్నదాతలకు సాగునీటి విషయంలో శ్రీరామరక్షగా నిలుస్తోంది.

సెప్టెంబరు 7న గోకులాష్టమి

తిరుచానూరు(చంద్రగిరి): తిరుచానూరు పద్మావతి అమ్మవారి ఆలయ అనుబంధ శ్రీకృష్ణస్వామి ఆలయంలో సెప్టెంబరు 7న గోకులాష్టమిని నిర్వహించనున్నట్లు టీటీడీ అధికారులు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. గోకులాష్టమి రోజున శ్రీకృష్ణస్వామి మూలవర్లకు అభిషేకం, అర్చన చేస్తామని, ముఖ మండపంలో మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 4 గంటల వరకు శ్రీకృష్ణ స్వామి ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం, సాయంత్రం ఊంజల్‌సేవ చేస్తామని వెల్లడించారు. రాత్రి 7 నుంచి 8.15 గంటల వరకు స్వామివారు పెద్దశేష వాహనంపై మాడ వీధుల్లో విహరిస్తారని తెలిపారు. రాత్రి 8.30 నుంచి 9 గంటల వరకు గోపూజ, గోకులాష్టమి ఆస్థానం నిర్వహిస్తామని పేర్కొన్నారు. సెప్టెంబరు 8న ఉట్లోత్సవాన్ని పురస్కరించుకొని మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 4 గంటల వరకు స్నపన తిరుమంజనం, తరువాత ఊంజల్‌సేవ ఉంటాయని వెల్లడించారు. సాయంత్రం స్వామివారికి ఉట్లోత్సవం, ఆస్థానం నిర్వహిస్తారు. ఈ కారణంగా సెప్టెంబరు 8న ఆలయంలో సహస్ర దీపాలంకరణ సేవను రద్దు చేస్తున్నట్లు వివరించారు.

పరుశురామేశ్వరుడి సేవలో నటుడు గుండు సుదర్శన్



ఏర్పేడు: మండలంలోని గుడిమల్లం పరుశురామేశ్వర స్వామివారిని ఆదివారం సినీ నటుడు గుండు సుదర్శన్ దంపతులు దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు ఆయనకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన ఆలయంలో అర్చనలు, పూజలు నిర్వహించారు. అనంతరం గుండు సుదర్శన్‌ను పూలమాలలు, శాలువలతో సన్మానించి స్వామివారి చిత్రపటాన్ని అందజేశారు. ఆలయ విశిష్టతను అడిగి తెలుసుకున్నారు. అతి పురాతనమైన ఆలయాన్ని దర్శించుకోవడం తన పూర్వ జన్మ సుకృతమని ఆయన తెలిపారు. కార్యక్రమంలో వే ఫౌండేషన్ వ్యవస్థాపకుడు పైడి అంకయ్య, లైఫ్ సొసైటీ అధ్యక్షుడు వినయ్‌కుమార్, ఎంపీటీసీ ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా మాతా పరమేశ్వరి నగరోత్సవం


చందన అలంకారంలో మాత పరమేశ్వరి


అగ్నిగుండ ప్రవేశానికి ఏర్పాట్లు

–ముగిసిన అమ్మవారి కొలుపు ఉత్సవాలు

నాయుడుపేటటౌన్: పట్టణంలోని అగ్రహారపేట అరుంధతీవాడలో ఉన్న మాతాపరమేశ్వరి కొలుపు ఉత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి అమ్మవారి నగరోత్సవం వైభవంగా నిర్వహించారు. అమ్మవారికి విశేష పూజలు చేశారు. మహిళలు ఆలయం వద్ద పొంగళ్లు పెట్టి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులు పసుపు, కుంకుమ సారెను ఊరేగింపుగా తీసుకొచ్చి అమ్మవారికి సమర్పించారు. రాత్రి అగ్నిగుండ ప్రవేశం చేశారు. రాత్రి మాతా పరమేశ్వరి అమ్మవారిని వివిధ రకాల పుష్పాలతో సుందరంగా అలంకరించారు. డప్పు వాయిద్యాలు, బణాసంచా పేలుళ్ల నడుమ నగరోత్సవాన్ని నిర్వహించారు. ఆలయ పూజారి బాబు, కౌన్సిలర్‌లు నాగార్జున పర్యవేక్షించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ దీపిక, రవి, భరత్, నాగరాజు, సుమంత్ రెడ్డి, సుమన్, రత్నయ్య, వెంకటయ్య, బాబు తదితరులు పాల్గొన్నారు.


పొంగళ్లు పెట్టేందుకు ఊరేగింపుగా వస్తున్న భక్తులు


ఆలయం వద్ద పొంగళ్లు పెడుతున్న మహిళలు

జగనన్న ఆశయాలకు అనుగుణంగా పనిచేద్దాం


రామ్‌కుమార్‌రెడ్డిని సత్కరిస్తున్న గూడూరు నేతలు

• నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

వాకాడు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశయాలకు అనుగుణంగా సమష్టిగా పనిచేద్దామని వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు, వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి అన్నారు. ఆదివారం గూడూరు నియోజకవర్గంలోని పలు మండలాలకు చెందిన వైఎస్సార్‌సీపీ ముఖ్య నేతలు, కార్యకర్తలు వాకాడులోని ఆయన నివాసంలో రామ్‌కుమార్‌రెడ్డిని కలిశారు. ఆయన్ను గజమాలతో సత్కరించి పలు విషయాలపై చర్చించారు. ఇటీవల వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యవర్గంలో స్థానం పొందిన పలువురు నాయకులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా రామ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో చెప్పిన హామీలన్నీ నెలరవేర్చిన ఘనత జగనన్నే దక్కిందన్నారు. అఖండ ప్రజాధరణతో రాష్ట్రంలో మళ్లీ జగనన్న ప్రభుత్వం రావడం ఖాయమన్నారు. జిల్లా కార్యవర్గంలో స్థానం పొందిన ప్రతి ఒక్కరూ పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులు నాయకులు, కార్యకర్తలు సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి వారిని చైతన్యం చేయాలన్నారు. తమకు కేటాయించిన పదవులకు వన్నె తెచ్చేలా పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. కష్టపడిన వారికి పార్టీ ఎప్పుడూ అండగా నిలుస్తుందన్నారు. తగిన గుర్తింపు ఇస్తుందని స్పష్టం చేశారు. నాయకులు, కార్యకర్తలకు ఏదైనా ఇబ్బంది తలెత్తినా తన దృష్టికి తీసుకొస్తే పరిష్కరించేందుకు అందుబాటులో ఉంటానని భరోసా ఇచ్చారు. పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి, నాయకులు కొడవలూరు దామోదర్‌రెడ్డి, పాపారెడ్డి రాజశేఖర్‌రెడ్డి, బత్తిన విజయకుమార్, దేవారెడ్డి నాగూర్‌రెడ్డి, వాటంగారి వెంకటరమణయ్య, షనీల్‌రెడ్డి, గూడూరు సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రామ్‌కుమార్‌రెడ్డిని కలిసిన ఐఐహెచ్‌టీ పూర్వ విద్యార్థులు


ఐఐహెచ్‌టీ పూర్వ విద్యార్థులతో రామ్‌కుమార్‌రెడ్డి

వెంకటగిరిరూరల్: వెంకటగిరి ఐఐహెచ్‌టీ (ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్‌లూమ్ టెక్నాలజీ) అసోసియేషన్ సభ్యులు ఆదివారం నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డిని కలిశారు. ఐఐహెచ్‌టీ అభ్యున్నతికి తన వంతు కృషిచేస్తానని ఆయన వారికి హామీ ఇచ్చారు. దీనిపై అసోసియేషన్ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. అసోసియేషన్ ప్రెసిడెంట్, పూర్వ విద్యార్థి నక్కా దుర్గాప్రసాద్, వైస్ ప్రెసిడెంట్ గంగాధర్, జాయింట్ సెక్రటరీ కేదార్నాథ్, బత్తల భాస్కర్, గజం శ్రీనివాస్, సంతాన కృష్ణన్, పోతులు, కిషోర్ ఉన్నారు.

డీవీ సత్రంలో భారీ వర్షం


వరి నాట్లు వేసేందుకు సిద్ధం చేసిన పొలం

దొరవారిసత్రం: మండల పరిధిలో శనివారం రాత్రి నుంచి ఆదివారం ఉదయం వరకు ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. పలు గ్రామాల్లోని చెరువుల్లో కొద్దిపాటి నీరు చేరాయి. రైతులు వ్యవసాయ పనులు మొదలు పెట్టేందుకు సన్నాహాలు చేస్తున్నారు. అడపదడప కురిసిన వానలకు ఇప్పటికే నెలబల్లి, ఆనేపూడి, కల్లూరు, కల్లూరుకండ్రిగ, తొగరాముడి, పూలతోట, సింగనాలత్తూరు, వేణుంబాకం తదితర గ్రామాల్లో దుక్కులు దున్నే పనిలో రైతులు నిమగ్నమయ్యారు. కాళంగి నది పరివాహ ప్రాంతాలైన తనియాలి, తల్లంపాడు, మొదుగులపాళెం, లింగంపాడు, కమ్మకండ్రిగ, తదితర గ్రామాల్లో వరి నాట్లు వేసేందుకు పొలాలను సిద్ధం చేస్తున్నారు.

బహిరంగ సభను జయప్రదం చేద్దాం


మాట్లాడుతున్న సీపీఐ నాయకులు

గూడూరురూరల్: సీపీఐ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 8వ తేదీ తిరుపతిలో జరిగే బహిరంగ సభను జయప్రదం చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సీహెచ్ ప్రభాకర్, నియోజకవర్గ కార్యదర్శి శశికుమార్ కోరారు. గూడూరు సీపీఐ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరల పెంపుతో నిత్యావసర వస్తువుల ధరలు అమాంతం పెరిగాయని తెలిపారు. దేశంలో పేద, మధ్యతరగతి ప్రజల జీవనం దుర్భరంగా మారిందన్నారు. నాయకులు సీతాభాస్కర్, కుమార్, రమేష్, నారాయణ, చంద్రయ్య, చల్లా వెంకటేశ్వర్లు, గౌస్‌బాషా, యాకూబ్, సుబ్రమణ్యంరాజు పాల్గొన్నారు.

ఖైదీకి అవార్డు, ప్రశంసాపత్రం


అవార్డు, ప్రశంసాపత్రం అందజేస్తున్న అంబేడ్కర్ యూనివర్సిటీ అధికారులు

కడప అర్బన్: హత్య కేసులో 24 ఏళ్లపాటు జీవిత ఖైదు అనుభవిస్తున్న టి.శ్రీకాంత్ గౌడ్‌కు అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ సీతారామన్ అవార్డుతోపాటు ప్రశంసాపత్రాన్ని అందజేశారు. తిరుపతి జిల్లా గూడూరు మండలం చెన్నూరు గ్రామానికి చెందిన శ్రీకాంత్‌గౌడ్ 24 ఏళ్ల కిందట ఓ హత్య కేసులో కడప కేంద్రకారాగారానికి జీవిత ఖైదుగా వచ్చాడు. రాజమండ్రి జైల్లో వున్నపుడు అంబేడ్కర్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ ద్వారా డిగ్రీ పూర్తి చేశారు. కడప కేంద్ర కారాగారానికి వచ్చాక ఎం.ఏ సోసియాలజీ పూర్తి చేశారు. అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ ఏర్పాటు చేసి 40 ఏళ్లు పూర్తయిన సందర్భంగా.. నాలుగు నెలల క్రితం రాష్ట్రంలోని అన్ని జైళ్లలో వున్న ఖైదీలకు «డాక్టర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ విత్ మై లైఫ్» అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఇందులో భాగంగా కడప కేంద్ర కారాగారంలో నిర్వహించిన పోటీల్లో శ్రీకాంత్ గౌడ్ పాల్గొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా జైళ్లలో వున్న 44 మంది ఖైదీలు పోటీల్లో పాల్గొన్నారు. శ్రీకాంత్ గౌడ్ రాసిన వ్యాసానికి స్పెషల్ కేటగిరిలో మొదటి బహుమతి వచ్చింది. శనివారం హైదరాబాద్‌లోని అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీలో నిర్వహించిన కార్యక్రమంలో వైస్ చాన్స్‌లర్ సీతారామన్ చేతుల మీదుగా ప్రశంసాపత్రంతోపాటు జ్ఞాపికను అందజేశారు. ప్రస్తుతం శ్రీకాంత్ గౌడ్ నెల్లూరు జిల్లాలో కేంద్ర కారాగారంలో వున్నారు. 24 ఏళ్లుగా జైలులో వున్నాననీ, ఈ అవార్డు రావడంతో చాలా సంతోషంగా వున్నానని, తనకు విముక్తి కల్పించాలన్నారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



నృత్యాలతో ప్రేక్షకులను అలరిస్తున్న కళాకారులు



తిరుచానూరు(చంద్రగిరి): వారాంతపు సాంస్కృతిక కార్యక్రమంలో భాగంగా తిరుచానూరు సమీపంలోని శిల్పారామంలో ఆదివారం సాయంత్రం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. బెంగళూరుకు చెందిన ఈశ్వరాంబ నృత్యశాల ఆధ్వర్యంలో నాట్య గురువు ప్రీతి మీనన్ పర్యవేక్షణలో కళాకారులు చేసిన కూచిపూడి, భరతనాట్యం ఆకట్టుకుంది. కళాకారులు అనాఘ, శ్రీయ, మీనన్, శ్రీయాస్, గౌరి, విజయ, వేదిక, ఆర్యన్ నంద, అన్విత ప్రియను ఏఓ ఖాదర్‌వల్లీ సత్కరించి, జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో రాధాకృష్ణ, పప్పి, వరప్రసాద్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.